సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.10,100 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.11 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.2°/12.4°

జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు 'సూర్యప్రభ'పై ఖాద్రీశుడు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు(ఫైల్)

కదిరి టౌన్‌: రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి స్వామివారు సూర్య ప్రభ వాహనంపై దర్శనమివ్వనున్నారు. విశేష పుష్పాలంకరణతో తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

ఇంటర్‌ పరీక్షకు 334 మంది గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్‌ మొదటి సంవత్సరం పబ్లిక్‌ పరీక్షల్లో భాగంగా సోమవారం 'పర్యావరణ విద్య' పరీక్ష నిర్వహించారు. జిల్లాలో 13,163 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 12829 మంది హాజరైనట్లు ఇంటర్‌ విద్య జిల్లా అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. మరో 334 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలను స్పెషల్‌ ఆఫీసర్‌ చెన్నకేశవ ప్రసాద్‌, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సురేష్‌బాబు, శ్రీరామరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు.

'రేషం సబ్సిడీ' పునరుద్ధరించాలి



కలెక్టరేట్‌ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

ప్రశాంతి నిలయం: గత ప్రభుత్వం చేనేతల సంక్షేమం కోసం అమలు చేసిన రేషం సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని చేనేత కార్మికులు డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికులు చేనేత కార్మికులు ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం 'నేతన్న నేస్తం' పేరుతో ఏటా రేషం సబ్సిడీ రూ.24 వేలు ఇచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పథకం ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం చేనేత కార్మికులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి రేషం సబ్సిడీ పథకంతోపాటు ఉచితంగా 200 యూనిట్లు కరెంట్‌ సరఫరా చేయాలని డిమాండ్‌ చేశారు. సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కల్తీ పాల యూనిట్‌ సీజ్‌



కల్తీ పాల యూనిట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్‌ అధికారులు

అనంతపురం: కల్తీ పాల యూనిట్‌ను విజిలెన్స్‌ అధికారులు సీజ్‌ చేశారు. రాప్తాడు మండలం ఎం. బండమీద పల్లి గ్రామంలోని ఎర్రగుంట రామిరెడ్డి ఇంట్లో కల్తీ పాల యూనిట్‌పై సోమవారం విజిలెన్స్‌ అధికారులు మెరుపుదాడి చేశారు. పామ్‌ ఆయిల్‌, ఉప్పు, మాల్టోడైక్స్ట్రిన్‌ పౌడర్‌తో చిక్కని ద్రవం తయారు చేసి లీటరు పాలపై రూ. 10 అదనంగా సంపాదించాలనే ఆశతో కల్తీ చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ పాలు తాగితే గ్యాస్ట్రిక్‌ సమస్యలతో పాటు క్యాన్సర్‌ వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో కల్తీ పాల యూనిట్‌ను సీజ్‌ చేసి, పాల నమూనాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్‌ అధికారి వైబీపీటీఏ ప్రసాద్‌ హెచ్చరించారు.

పచ్చ కుట్రకే పీఠం

- హిందూపురంలో ప్రజాస్వామ్యం అపహాస్యం
- మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నికలో టీడీపీ అడ్డదారులు
- అధికారానికే అండగా నిలిచిన యంత్రాంగం
- వైఎస్సార్‌ సీపీ విప్‌ జారీ చేసినా అనుమతించని వైనం
- సంతలో పశువుల్లా అమ్ముడుపోయిన కౌన్సిలర్లు
- చైర్మన్‌ పీఠంపై కూర్చున్న టీడీపీ సభ్యుడు డీఈ రమేశ్‌

ప్రలోభాలు.. బెదిరింపులు.. కుట్రలు.. క్యాంపు రాజకీయాలు.. అధికార దౌర్జన్యాలు.. ఇలా ఎంతగా దిగజారాలో.. అంతా దిగజారింది అధికార టీడీపీ. ప్రజాస్వామ్యం ఖూనీ అయినా ఫర్లేదు.. కేవలం పీఠంపై కూర్చుంటే చాలన్నట్లు వ్యవహరించింది. మైకు అందిస్తే చాలు పురాణాలు, ఇతిహాసాలు, బ్లడ్డు, బ్రీడు అంటూ గొప్పలు చెప్పే నందమూరి బాలకృష్ణ విలువలు వదిలేసి ఈ దుర్మార్గ ఎన్నికలో అంతా తానై నిలిచారు. ఆరుగురు సభ్యులున్న టీడీపీలో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసి గొప్ప ఘనకార్యమంటూ టపాసులు పేల్చారు.

'పురం' మున్సిపాలిటీలో బలాబలాలు (2021)	
మొత్తం వార్డులు	38
వైఎస్సార్‌సీపీ గెలిచిన వార్డులు	30
టీడీపీ గెలిచినవి	06
ఎంఐఎం	01
స్వతంత్ర	01

తాజా చైర్మన్‌ ఎన్నికలో పోలైన ఓట్లు ఇలా..	
టీడీపీ (ఎంపీ, ఎమ్మెల్యేతో సహా)	23
వైఎస్సార్‌సీపీ	14
గైర్హాజరు	02
చెల్లని ఓటు (ఆలస్యంగా రావడంతో)	01



మున్సిపల్‌ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, పుట్టపర్తి/హిందూపురం: ఫిరాయింపు రాజకీయం తమకు కొత్త కాదని టీడీపీ మరోసారి రుజువు చేసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను సంతలో పశువులు కొన్నట్లు కొనడం తమకే సాధ్యమని నిరూపించింది. అధికారం అండతో చైర్మన్‌ పీఠం దక్కించుకుంది.

క్యాంపు నుంచి నేరుగా కౌన్సిల్‌కు...

హిందూపురం మున్సిపల్‌ చైర్మన్‌ స్థానం కోసం సోమవారం జరిగిన ఎన్నికలో అధికార టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఆరుగురు సభ్యులతో చైర్మన్‌ పీఠం కోసం పోటీ పడిన టీడీపీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా సీఎం బావమరిది, స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ చైర్మన్‌ ఎన్నికలో అన్నీతానై నడిపించారు. అప్పటికే తమవైపు లాక్కున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో పాటు టీడీపీ, ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లను ఐదురోజుల ముందే క్యాంప్‌నకు తరలించారు. సోమవారం ఉదయం సరిగ్గా ఎన్నిక సమయానికి కౌన్సిల్‌కు తీసుకువచ్చారు. అంతేకాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ విప్‌ కూడా పరిగణనలోకి తీసుకోకుండా అడ్డుకుంటూ కుట్రలు చేశారు.

టీడీపీ గెలిచిందిలా..

సోమవారం జరిగిన చైర్మన్‌ ఎన్నికలో టీడీపీ తరపున 6వ వార్డుకు చెందిన డీఈ రమేష్‌ బరిలో నిలవగా, వైఎస్సార్‌ సీపీ 3వ వార్డు కౌన్సిలర్‌ లక్ష్మిని పోటీలో నిలిపింది. ఎన్నిక ప్రారంభించగానే టీడీపీ సభ్యులు ఆరుగురు, బీజేపీ, ఎంఐఎం అభ్యర్థితో పాటు వైఎస్సార్‌ సీపీ నుంచి ఫిరాయించిన మరో 13 మంది కౌన్సిలర్లు టీడీపీ అభ్యర్థి రమేష్‌కు మద్దతు తెలిపారు. అలాగే ఎక్స్‌అఫీషియో సభ్యుల హోదాలో ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా మద్దతు తెలపగా టీడీపీ అభ్యర్థి రమేష్‌కు 23 ఓట్లు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుదారులు పోగా వైఎస్సార్‌ సీపీకి 17 మంది కౌన్సిలర్లు ఉండగా... ఎన్నికకు ఇద్దరు గైర్హాజరయ్యారు. మరో కౌన్సిలర్‌ ఆలస్యంగా వచ్చి ఓటు వేసినా.. చెల్లదని అధికారులు ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లక్ష్మికి 14 ఓట్లు పోల్‌ కాగా, టీడీపీ అభ్యర్థి డీఈ రమేష్‌ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్‌ అధికారి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ ప్రకటించారు.

అక్టోబర్‌ నుంచి పట్టుబట్టి..

38 వార్డులున్న హిందూపురం మున్సిపాలిటీలో గత మున్సిపల్‌ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ 30 వార్డుల్లో ఘన విజయం సాధించింది. వైఎస్‌ జగన్‌ ఆశీస్సులతో తొలిసారి కౌన్సిల్‌కు ప్రాతినిథ్యం వహించిన వాల్మీకి వర్గానికి చెందిన ఇంద్రజ చైర్‌పర్సన్‌ అయ్యారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. ఆరుగురు సభ్యులున్న టీడీపీ చైర్మన్‌ గిరిపై కన్నేసింది. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్‌ సూచన మేరకు కొందరు వైఎస్సార్‌సీపీ సభ్యులు.. బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తర్వాత చైర్మన్‌గా ఉన్న ఇంద్రజ కూడా పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో చైర్మన్‌ పీఠం ఖాళీ అయింది. వైస్‌ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా కొనసాగించారు. ఎన్నిక అనివార్యం కాగా టీడీపీ రాజకీయం చేసి చైర్మన్‌ పీఠం కైవసం చేసుకుంది.

అధికారానికి తలొగ్గిన యంత్రాంగం..



రమేష్‌కు డిక్లరేషన్‌ ఇస్తున్న ప్రిసైడింగ్‌ అధికారి ఆనంద్‌కుమార్‌

హిందూపురం మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నిక సందర్భంగా యంత్రాంగమంతా అధికార పార్టీకి తలొగ్గింది. ముందుగానే మున్సిపల్‌ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు మున్సిపల్‌ కార్యాలయం వైపు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేశారు. వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లతో పాటు నాయకులు రాగా... గేటు వద్దే నాయకులను నిలిపివేశారు. చివరకు మీడియా ప్రతినిధులను సైతం కౌన్సిల్‌ హాలు వరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కానీ టీడీపీ కౌన్సిలర్ల వెంట ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ పీఏలు వెళ్తున్నా..ఏ మాత్రం అడ్డుచెప్పలేకపోయారు. అనుమతిలేని వారులోనికి ప్రవేశించరాదని అప్పటి వరకూ హంగామా చేసిన పోలీసులు...టీడీపీ నేతలకు వంగి వంగి సలాములు చేయడం చూసి జనం తప్పుపట్టారు.

'పురం'.. అష్ట దిగ్బంధం



టీఎన్‌ దీపికను అడ్డుకుంటున్న దృశ్యం

హిందూపురం అర్బన్‌: మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నిక నేపథ్యంలో హిందూపురాన్ని పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. ఆదివారం సాయంత్రానికే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సోమవారం పట్టణంలో 144 సెక్షన్‌, 30 పోలీస్‌ యాక్ట్‌ అమలు చేశారు. మున్సిపల్‌ కార్యాలయానికి వెళ్లే దారులన్నీ బారికేడ్లతో మూసి వేశారు. ఉదయం నుంచే ట్రాఫిక్‌ మళ్లించారు. ఉదయం 10.30 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో కలిసి ఆ పార్టీ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి కాలి నడకన మున్సిపల్‌ కార్యాలయం వద్దకు చేరుకోగా...నాయకులను అడ్డుకున్నారు. ఆ తర్వాత టీడీపీతో పాటు ఆ పార్టీకి మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, బాలకృష్ణ పీఏలు, ఇతర నాయకులు కౌన్సిల్‌కు వెళ్తున్నా అడ్డుకునే ధైర్యం చేయలేకపోయారు. దీంతో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకులు వేణురెడ్డి నిరసనకు దిగారు.

నిబంధన మేరకే అనుమతి..

మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నికల్లో నిబంధనల మేరకే కౌన్సిల్‌ హాలులోకి ప్రవేశం కల్పించామని ఎస్పీ రత్న తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందస్తు ప్రణాళిక, పటిష్ట బందోబస్తు నడుమ ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా చూశామని పేర్కొన్నారు.



ఇరుపార్టీల కౌన్సిలర్ల మధ్య బారికేడ్లు ఏర్పాటు చేసి కూర్చోబెట్టిన దృశ్యం



పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మీ సంబరం సంవత్సరమే

- ఏడాదికోసం ఎందుకంత కష్టం బాలయ్యా..?
- గోడ దూకిన కౌన్సిలర్లకు భవిష్యత్తు ఉండదు
- విలేకరుల సమావేశంలో టీఎన్‌ దీపిక, వేణురెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న టీఎన్‌ దీపిక, గుడ్డంపల్లి వేణురెడ్డి తదితరులు

హిందూపురం: ''ప్రజలు వైఎస్సార్‌ సీపీకి పట్టం కట్టారు. బాలకృష్ణ కౌన్సిలర్లకు రేటు కట్టి సంతలో పశువులు కొన్నట్లు కొన్నారు. ఆయన సంబరం ఏడాదే. ఇంకో ఏడాదిలో మున్సిపల్‌ ఎన్నికలొస్తాయి. అప్పుడు ప్రజాభిమానంతో వైఎస్సార్‌ సీపీ మళ్లీ సగర్వంగా మున్సిపాలిటీపై జెండా ఎగురవేస్తుంది. అవకాశం, గుర్తింపు, పదవి ఇచ్చిన పార్టీకి నమ్మక ద్రోహం చేసి వెళ్లిపోయిన ఆ కౌన్సిలర్లకు రాజకీయ సమాధి తప్పదు'' అని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్‌ దీపిక, నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌ సీపీ తరపున గెలిచి పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లతో రాజీనామా చేయించి ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించి చైర్మన్‌ పదవి సొంతం చేసుకుని ఉంటే అప్పుడు బాలకృష్ణను అందరూ హీరో అనేవారనీ, ఇలా దొడ్డిదారిన రాజకీయాలు చేయడంతో ఆయన జీరో అయ్యాడన్నారు. చైర్మన్‌ ఎన్నికల్లో బాలకృష్ణతో పాటు ఆ పార్టీ నేతలు దిగజారి ప్రవర్తించారన్నారు. క్యాంపు రాజకీయాలు, కుట్రలు చేసి సంబరాలు చేసుకుంటున్నారని, ఎక్కువ రోజులు వారి కుట్ర రాజకీయాలు సాగవన్నారు. రానున్న మున్సిపల్‌ ఎన్నికల్లో ప్రజాభిమానంతో హిందూపురంలో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక పోలీసులు, అధికారులు కూడా మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నికల్లో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారనీ, అధికార పార్టీకి మేలు చేసేందుకు కోడ్‌, ప్రొటోకాల్‌ విస్మరించారని మండిపడ్డారు. వారిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు..

వైఎస్సార్‌ సీపీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని టీఎన్‌ దీపిక అన్నారు. కష్టకాలంలోనూ ధైర్యంగా నిలిచి పోరాడిన వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపి అభినందించారు. వైఎస్సార్‌ సీపీ జెండాతో గెలిచి ఇప్పుడు టీడీపీ పంచన చేరిన కౌన్సిలర్లకు రాజకీయ భవిష్యత్‌ ఉండదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ఏ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్‌ గౌడ్‌, కౌన్సిలర్లు మల్లికార్జున, రామచంద్ర, నాగేంద్రబాబు, మండల కన్వీనర్లు రాము, రామకృష్ణారెడ్డి, న్యాయవాది వెంకటరెడ్డి, నాయకులు దాదు, నాగరాజు, లోకేష్‌, చంద్రశేఖర్‌రెడ్డి, తిప్పేరుద్రయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

జీవితమంతా దొడ్డిదారి రాజకీయాలేనా..?



చంద్రబాబు జీవితమంతా దొడ్డిదారి రాజకీయాలే చేశారు. ఆనాడు నేరుగా గెలవలేక మామను వెన్నుపోటు పొడిచారు. నేరుగా ఆయన ఎప్పుడూ గెలవలేరు. అందుకే ప్రతిసారీ పొత్తులతో గద్దెనెక్కడం ఆయన అలవాటు. ఆయన బావమరిది బాలకృష్ణ కూడా హిందూపురం మున్సిపల్‌ ఎన్నికల్లో అదే దారిని ఎన్నుకున్నారు. వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్లను కొనుగోలు చేశారు. పార్టీ ఫిరాయింపులతో దొడ్డిదారి రాజకీయాలు చేసి పీఠం దక్కించుకున్నారు. ఇది ప్రజలు హర్షించరు.

– ఉషశ్రీ చరణ్‌, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని, అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 224 అర్జీలు అందగా, వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు శాఖ అధిపతులే కన్వీనర్లుగా ఉంటారని, అందువల్ల పనులు త్వరితగతిన పూర్తి చేయడంలో వారే ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం వచ్చిన వినతులపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అలాగే జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రులు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధి మండలిలో చర్చించిన పలు అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌, డీఆర్‌ఓ విజయ సారథి, డిప్యూటీ కలెక్టర్‌ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్‌, సీపీఓ విజయ్‌ కుమార్‌, హౌసింగ్‌ పీడీ వెంకటనారాయణ, లాండ్‌ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణ కుమార్‌, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్‌, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ తిప్పేంద్ర నాయక్‌, డీఎంహెచ్‌ఓ ఫైరోజ బేగం, ఐసీడీఎస్‌ పీడీ నాగమల్లేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్‌, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావుతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల దినోత్సవం..

ఫిబ్రవరి 10 తేదీన జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1 – 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్‌ 400 ఎంజీ మాత్రలను మింగించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్‌ స్కూళ్లలో 3,66,225 మంది పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఫైరోజ బేగం, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ తిప్పేంద్ర నాయక్‌, ఆర్బీఎస్‌కే పీఓ డాక్టర్‌ నివేదిత పాల్గొన్నారు.

జలధి ఉత్సవం.. జన తరంగం

అమరాపురం: మండలంలోని ఉదుగూరులో వక్కలిగులు, సోమేనహళ్లి, జానకల్లు గోత్రానికి చెందిన వారి ఇలవేల్పు కెంచమాంబదేవి జలధి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊరి పొలిమేరలోని వంక వద్దకు డప్పు వాయిద్యాలతో చేర్చి, అక్కడ గంగా జలంతో శుద్ధి చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 101 వడలు వేసి గ్రామంలో ఉన్న అన్ని కులాల వారికి ప్రసాదంగా అందజేశారు. జిల్లా నుంచే కాక కర్ణాటక ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో ఉదుగూరు జనసంద్రమైంది. సాయంకాలం ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాలతో ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎద్దులబండ్ల పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



జలధికి ముందు కెంచమాంబదేవి ఉత్సవ విగ్రహానికి పూజ నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవంలో పాల్గొనేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు



పోటీలో పాల్గొనేందుకు ఎద్దుల బండ్లతో వచ్చిన యువకులు

క్లుప్తంగా

నాగ ప్రతిమల ధ్వంసం



నాగులకట్టపై ముక్కలైన నాగ ప్రతిమల విగ్రహాలు

కదిరి అర్బన్: మాఘమాసం సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రజలు పూజించుకునే నాగ ప్రతిమలను ఓ దుండగుడు ధ్వంసం చేశాడు. కదిరి మండలం మల్లయ్యగారిపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టాడు. గ్రామ కూడలిలో ఉన్న నాగులకట్టపై భక్తులు పూజించుకుంటున్న నాగ ప్రతిమలను ముక్కముక్కలుగా ధ్వంసం చేశాడు. అనంతరం ఆ పక్కనే ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహంపై రాళ్లు రువ్వాడు. ఆ సమయంలో శబ్దాలకు చుట్టుపక్కల వారు నిద్రలేచి దారుణాన్ని పసిగట్టి శ్రీనివాసులను బంధించి కదిరి రూరల్ పోలీసులకు అప్పగించారు.

మామిడి తోటకు నిప్పు



మంటల్లో కాలిపోతున్న మామిడి చెట్లు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో రైతు విష్ణువర్ధన్‌కు చెందిన మామిడి తోటకు సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు పెట్టారు. మంటలు ఎగిసి పడుతూ మొత్తం ఆరు ఎకరాల్లోని తోటను చుట్టుముట్టడంతో ఆర్పేందుకు బాధిత రైతు, స్థానికులు చేసిన ప్రయత్నం విఫలమైంది. సమాచారం అందుకున్న హిందూపురం ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పే లోపు 70 చెట్లు కాలిపోయాయి.

మామిడి మొక్కల దగ్ధం

తనకల్లు: ఆకతాయిలు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి మామిడి మొక్కలు దగ్ధమయ్యాయి. తనకల్లు మండలం కనసానివారిపల్లిలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఉదయ్‌శేఖర్ తన పొలంలో మామిడి మొక్కల పెంపకం చేపట్టాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కొందరు ఆకతాయిలు సమీపంలోని గుట్టకు నిప్పు రాజేశారు. దీంతో మంటలు చెలరేగి ఉదయ్‌శేఖర్ తోటను చుట్టుముట్టాయి. ఘటనలో 40 మామిడి మొక్కలు, 25 స్ప్రింక్లర్ పైపులు, కూరగాయల పంటకు ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఘటనతో దాదాపు రూ.70 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

అగ్గిపాలైన చీనీ చెట్లు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకపల్లిలో రైతు మాధవరాజుకు చెందిన చీనీ తోటలో రెండు రోజుల కిందట 150 చెట్లు దగ్ధమయ్యాయి. సోమవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌తో కలసి రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని 11 ఏళ్ల కిందట 500 చీనీచెట్లు సాగు చేశాడు. ఏడేళ్లుగా దిగుబడి తీసుకుంటున్నాడు. ఈసారి కూడా చెట్లను కాపునకు వదిలాడు. పిందెలు ఏర్పడ్డాయి. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు పక్కతోట మేరకున్న గడ్డికి నిప్పు పెట్టారు. ఉద్దేశ పూర్వకంగా నిప్పు పెట్టారా? లేదా పొరబాటున జరిగిందో తెలీదుకానీ మంటలు చుట్టుముట్టి మాధవరాజు తోటలోని 150 చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై సర్వే చేయించి రిపోర్ట్ తెప్పించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

- మార్చి 12న ఫీజుపోరుకు సిద్ధం
- వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్
- మద్దతు తెలిపిన ఐక్య విద్యార్థి సంఘాలు



రమేష్ గౌడ్‌తో కలసి ఫీజు పోరుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామంటూ వైఎస్సార్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును విజయవంతం చేసేలా అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని ముందుకు పోతున్నామన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నాడు పారదర్శకంగా బకాయిల చెల్లింపులు

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బకాయి ఉన్న రూ.1,780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే పారదర్శకంగా అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా ఇంత వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదన్నారు. దీంతో బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించలేని స్థితిలో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం వద్దంటూ తెలుగు మహాసభల్లో కూటమి నేతలు, మేధావులని చెప్పుకునే కొందరు ప్రముఖులు మాట్లాడారన్నారు. తెలుగు ముద్దు అంటూనే.. స్వయానా రామోజీ కోడలు శైలజా కిరణ్ నడుపుతున్న రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో తెలుగు పాఠ్యాంశం లేకుండా జర్మన్, ఫ్రెంచ్, రష్యన్ సబ్జెక్ట్‌లతో నడుపుతున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెస్త వెంకటేష్, చంద్ర, నరసింహులు, నాగేంద్ర, లబ్బే రాఘవ, వంశీ, మోహన్, గణేష్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేద్దాం



విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును జయప్రదం చేద్దాం. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలి. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మంత్రి నారా లోకేష్ విఫలమయ్యారు.

– జెన్నే చిరంజీవి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులపై ఒత్తిడి



ఉర్దూ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.

– కేశవ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

బకాయిలు విడుదల చేయాలి



విద్యార్థుల ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మార్చి 12 జరిగే ఫీజు పోరుకు మేము సంపూర్ణ మద్దతునిస్తున్నాం. ఇప్పటికే గిరిజన విద్యార్థులను చైతన్యం చేశాం. ఫీజు పోరులో ముందుండి కదం తొక్కుతాం.

– మల్లికార్జున నాయక్, గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు

సరైన బుద్ధి చెబుతాం



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని ప్రభుత్వానికి సరైన బుద్ధి చెబుతాం. విద్యార్థుల పట్ల ప్రభుత్వం చులకన భావంతో ఉంది. ఎన్నికలకు ముందు ఒక మాట...అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడడం సరికాదు. ఫీజు పోరుకు విద్యార్థి లోకం తరలిరావాలి.

– నరేంద్ర, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులకు అండగా నిలుస్తాం



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం అనైతిక వైఖరిని నిరసిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును జయప్రదం చేద్దాం. విద్యార్థులకు అండగా నిలుద్దాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడుతాం.

– చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

లోకేష్‌వన్నీ బూటకపు హామీలు



విద్యార్థులకు అండగా ఉంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇది కేవలం ఉత్తరకుమారుడి ప్రగల్భాలుగానే మిగిలిపోయాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లిస్తామన్నారు. ఇవాళ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా మంత్రి నారా లోకేష్ కాలయాపన చేస్తున్నారు. లోకేష్‌వన్నీ బూటకపు హామీలేనని తేలిపోయింది.

– పృథ్వీ, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పాఠశాల సరుకులు పక్కదారి!

ఏజెన్సీ నిర్వాహకుడిపై పాఠశాల కమిటీ చైర్మన్ ఫిర్యాదు



బైక్‌పై సరుకులు తీసుకెళ్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు



ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈఓలతో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాల సరుకులు సెలవు రోజు.. అదీ రాత్రిపూట పక్కదారి పట్టడం కలకలం రేపింది. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్టోర్ రూమ్ నుంచి ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు అమీన్‌పీర్ మరొక వ్యక్తితో కలిసి ఒక బస్తా బియ్యం, 12 ట్రేల కోడిగుడ్లు, 10 హార్పిక్ బాటిళ్ల బాక్స్‌తో ద్విచక్రవాహనంపై తరలిస్తూ పాఠశాల కమిటీ చైర్మన్ బాబ్జీకి తారసపడ్డాడు. పాఠశాల సరుకులు ఇలా తీసుకెళ్తున్నారేంటని ప్రశ్నిస్తే.. సోమవారం విద్యార్థులకు కోడిగుడ్ల కూర వండాల్సి ఉన్నందున ఉడికేయడానికి తీసుకెళ్తున్నట్లు నిర్వాహకుడు సమాధానమిచ్చాడు. మరి బియ్యం, హార్పిక్ బాటిళ్లు దేనికి తీసుకెళ్తున్నారంటే నీళ్లు నమిలాడు. పాఠశాల వద్ద మరో మూడు బస్తాల బియ్యం కూడా కనిపించడంతో.. సరుకులన్నీ పక్కదారి పట్టిస్తున్నట్లుగా నిర్ధారణకు వచ్చిన కమిటీ చైర్మన్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సరుకుల తరలింపు ఘటనపై సీపీఐ, సీపీఎం నాయకులు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి, ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డితో ఆరా తీశారు. బియ్యం శుభ్రపరచడం కోసం ఒక బస్తా బయటకు తీసుకెళ్లారని హెచ్ఎం వివరణ ఇవ్వగా.. నిబంధనలకు విరుద్ధంగా ఇంటికి తీసుకెళ్లడం ఏమిటని నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, రమణ, చాంద్ బాషా ప్రశ్నించారు. విద్యాశాఖ సిబ్బంది గానీ, ఉపాధ్యాయ బృందం గానీ ఎవ్వరూ లేని సమయంలో గుట్టుగా సరుకులు తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నిధులను సద్వినియోగం చేసుకుందాం

గుంతకల్లు: బడ్జెట్‌లో గుంతకల్లు డివిజన్‌కు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుందామని డీఆర్ఎం సీ.చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం డివిజన్‌లో జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గాలకు నిధుల కేటాయింపులు జరిగాయన్నారు. రైలు ప్రమాదాల నివారణలో భాగంగా 'కవచ్'కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి రూ.9,417 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అమృత్ భారత్ కార్యక్రమం కింద 73 రైల్వేస్టేషన్లను ఆధునీకరించేందుకు రూ.2,051 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. డివిజన్ల వారీగా పూర్తి స్థాయి కేటాయింపుల వివరాలు పింక్ బుక్ ద్వారా త్వరలో తెలుస్తాయన్నారు. అంతకుముందు రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, గతి శక్తి ఛీఫ్ ప్రాజెక్టు మేనజర్ బీమారెడ్డి రామకృష్ణ, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎఫ్ఎం పీవీ రామకృష్ణ, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

- పేద విద్యార్థులపై కూటమి సర్కార్ కక్ష
- వైఎస్సార్‌టీఏ ధ్వజం

పుట్టపర్తి: నూతన మార్గదర్శకాల పేరుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తే సహించబోమని కూటమి సర్కార్‌ను వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 117ను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు హామీనిచ్చారని గుర్తు చేశారు. అధికారం దక్కి ఏడు నెలలైనా నేటికీ జీఓ 117ను రద్దు చేయకుండా ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు అంటూ ప్రభుత్వ పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని మండిపడ్డారు. ప్రత్యామ్నయ మార్గదర్శకాలు అమలైతే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల నిరుపేద గ్రామీణ పిల్లలు విద్యకు దూరమవుతారన్నారు. ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో ఒకే మీడియంను ప్రవేశపెట్టడం వల్ల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తగ్గిపోతాయని, ఎస్జీటీలకు పదోన్నతులూ కలగానే మిగులుతాయన్నారు. ఇలాంటి చర్యలతో రాబోవు రోజుల్లో కొత్త డీఎస్సీ ఎలా నిర్వహిస్తారని, ఒకవేళ నిర్వహించిన అర్హులకు పోస్టింగ్ సర్దుబాటు ఎలా చేస్తారని ప్రశ్నించారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రకు స్వస్తి చెప్పకపోతే అన్ని ఉపాధ్యాయ సంఘాలను సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ తరలింపులపై ఆదివారం 'చిత్ర వ్యథ' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై స్పందించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అనంతపురం నగరానికి చెందిన టిప్పరు, రామాపురం సమీపంలోని చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మూడు ఖాళీ టిప్పర్లను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తనఖీల్లో పోలీసులతో పాటు ఓబుళాపురం వీఆర్ఓ రాజశేఖర్, వీఆర్ఏ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు సరికాదు

- కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ పీఆర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస వినతి



అనంత కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్య వివరిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నాన్ని మానుకోవాలని కూటమి సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం ద్వారా రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారని, కడప కొప్పర్తి ఎమ్ఎస్ఎంఈ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి కల్పించారని... ఈ చర్యల ద్వారా రాయలసీమ ప్రాంతానికి నష్టం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు ఎన్నో విశిష్ట సేవలందిస్తూ రాయలసీమలో ఏపీజీబీ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ఈ బ్యాంక్ కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. ఈ చర్యను తక్షణం ఉపసంహరించుకోవాలన్న తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

వెలిగొండ సర్పంచ్ ఇంటిపై రాళ్లతో దాడి

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ గ్రామ సర్పంచ్ వీరాంజి ఇంటిపై అదే గ్రామానికి చెందిన పర్తప్ప కుటుంబసభ్యులు రాళ్లతో దాడి చేశారు. సర్పంచ్ సోదరుడు నాగప్ప కుమారుడు శివకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సోమవారం సర్పంచ్ వీరాంజి ఇంటి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచాడు. ఈ విషయంగా అదే గ్రామానికి చెందిన గుడిసెల పర్తప్ప, చంద్రశేఖర్, నీలకంఠ, చెన్నకేశవులు, సుంకప్ప, సిద్దప్ప, సునీత, మంగమ్మ గొడవకు దిగారు. అనంతరం ఇంటిపైకి రాళ్లు రువ్వారు. ఘటనలో సర్పంచ్ వీరాంజి భార్య లక్ష్మీదేవికి బలమైన మూగదెబ్బలు తగిలాయి. అక్కడితో ఆగకుండా గొడ్డళ్లతో దాడికి ప్రయత్నిస్తుంటే లక్ష్మీదేవి తప్పించుకుని పొలానికి పరుగున వెళ్లి జరిగిన విషయాన్ని భర్త వీరాంజి, కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో వారు క్షతగాత్రురాలిని ముందుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఘటనపై ఎస్ఐ జనార్దన్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన తనపై పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఇంటిపై రాళ్లు రువ్వి, గొడ్డళ్లతో దాడికి ప్రయత్నించారన్నారు. దాడి జరుగుతున్న సమయంలో డయల్ 100కు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా పోలీసులు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వివాహిత బలవన్మరణం



మృతురాలు జయంతి

రాయదుర్గం టౌన్: ఇష్టం లేని పెళ్లి చేయడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన చాకలి సుంకన్న, నాగమ్మ దంపతుల కుమార్తె జయంతి (21)కి మూడు నెలల క్రితం రాయదుర్గం మండలం కదరంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహమైంది. పెళ్లైన 15 రోజుల తర్వాత పుట్టింటికి చేరుకున్న ఆమె తిరిగి కాపురానికి వెళ్లలేదు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నట్లుగా బంధువులు చెబుతున్నా... జయంతికి ఇష్టం లేకపోయినా సొంత మేనమామతో పెళ్లి చేయడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా సమాచారం. ఘటనపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ జయానాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రజా వినతులపై స్పందించండి : ఎస్పీ



అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ రత్న


పుట్టపర్తి టౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అందజేస్తున్న వినతులపై స్పందించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను (ఎస్‌హెచ్‌ఓ) ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త మందలింపు... భార్య ఆత్మహత్య

- చిచ్చురేపిన సెల్‌ఫోన్ కొనుగోలు

అనంతపురం: సెల్‌ఫోన్‌పై మోజు ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ ఎందుకు కొనుగోలు చేశావంటూ భర్త మందలించడంతో క్షణికావేశంలో భార్య ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నాల్గో రోడ్డులో నివాసముంటున్న లక్ష్మీనారాయణ కుమారుడు పవన్‌కుమార్‌కు శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన రంజిత (30)తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు ప్రేమించుకున్నా... పెద్దల సమక్షంలోనే పెళ్లి చేశారు. వీరికి ఐదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. పెళ్లిళ్లలో డెకరేషన్, లైటింగ్ పనితో పవన్‌కుమార్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకు సెల్‌ఫోన్ కావాలని పలుమార్లు భార్య అడిగినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పవన్ కొనుగోలు చేసివ్వలేకపోయాడు. ఈ క్రమంలో భర్తకు తెలియకుండా ఇటీవల రంజిత రూ.15 వేలు ఖర్చు పెట్టి ఓ సెల్‌ఫోన్ కొనుగోలు చేసింది. విషయం తెలుసుకున్న పవన్‌కుమార్ తన భార్యను అనుమానిస్తూ మాట్లాడాడు. ఈ విషయంగా పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరికీ సర్ది చెప్పారు. అయినా పవన్ తన వైఖరి మార్చుకోకుండా తరచూ భార్యను అనుమానిస్తూ వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన రంజిత క్షణికావేశంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రంజిత తండ్రి రంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి: మాఘ మాసాన్ని పురస్కరించుకుని కుందుర్పిలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో విశేష పూజలు, హోమాలు పెద్ద ఎత్తున సాగాయి. మధ్యాహ్నం బ్రహ్మ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి విగ్రహాలను అధిష్టింపజేసి వేలాది భక్తుల గోవింద నామస్మరణ నడుమ లాగారు. ప్రత్యేక పూజల్లో కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, స్థానిక సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీపీ కమలానాగరాజు, వైస్ఎంపీపీలు భీమిరెడ్డి, అజయ్ బాబు, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఐటీ వింగ్ అధ్యక్షుడు మర్రిస్వామి, సర్పంచులు గంగాధర, జగన్ పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థి అదృశ్యం



మనోజ్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాములరాయి సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కె. మనోజ్ కనిపించకుండా పోయాడు. హాస్టల్‌లో ఉంటున్న మనోజ్ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోయే సరికి యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తాటిమాకులపల్లి గ్రామానికి చెందిన తండ్రి కృష్ణమూర్తి ఆ పాఠశాలకు చేరుకుని స్నేహితులను ఆరా తీశారు. చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం ఫిర్యాదు చేయడంతో రూరల్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.